క్లుప్తంగా

రేపు సంజీవదేవ్ పుస్తకంపై చర్చా వేదిక

తెనాలి: ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో నెలనెలా నిర్వహిస్తున్న చర్చా కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న బి.లలితానంద ప్రసాద్ రచించిన 'ఎప్పటికీ...అందరికీ సంజీవదేవ్' పుస్తకంపై చర్చా వేదికను ఏర్పాటుచేశారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగే చర్చా వేదికకు సమన్వయకర్తగా జి.ఎస్.నాగేశ్వరరావు వ్యవహరిస్తారు. ప్రముఖ కవి బండ్ల మాధవరావు, విశ్రాంత ఆధ్యాపకుడు పాలడుగు ఆనందయ్య, పుస్తక రచయిత బి.లలితానంద ప్రసాద్ పాల్గొంటారు.

ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

తెనాలి అర్బన్: క్రేడ్ సొసైటీ వ్యవస్థాపకులు బ్యూలా ఉమారాణి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వైద్యశాల సమీపంలోని సంస్థ కార్యాలయంలో గురువారం హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్, సంస్థ సభ్యులు కె.కాంతారాము, పి.కిరణ్‌కుమార్, భాస్కరరావు, ఏస్తేరు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తండ్రిపై కొడుకు దాడి

తెనాలి రూరల్: మద్యం మత్తులో తండ్రిపై కొడుకు దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుతోటకు చెందిన షేక్ జమాల్ బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి, ఆ మత్తులో తండ్రి అల్లాబక్షుపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడు తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ, ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

తెనాలి రూరల్: లారీ ఢీకొని ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన మామాఅల్లుళ్లు ప్రభుదాసు, నరేష్ గురువారం రాత్రి బైక్‌పై తెనాలి వస్తున్నారు. తెనాలి వైకుంఠపురం దేవస్థాన సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడిపోయారు. ఘటనలో మామాఅల్లుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుదాసు కాళ్లపైకి లారీ ఎక్కింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యభిచారానికి పాల్పడుతున్న వ్యక్తిపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లచెరువు తొమ్మిదో లైనులోని ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు గురువారం దాడి చేశారు. ఓ వ్యక్తితో పాటు ఇద్దరు మహిళల్ని స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదు చేసి, మహిళల్ని రెస్క్యూ హోంకు తరలించారు.

ఓ బొజ్జ గణపయ్యా.. నీ బంటు నేనయ్యా !

భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహాల నిమజ్జనం

తెనాలి టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణ, రూరల్ గ్రామాల్లోని వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల వద్ద గురువారం విశేషంగా పూజలు నిర్వహించారు. పూజల అనంతరం విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో కాల్వల్లో నిమజ్జనం చేశారు.

- పట్టణ పాండురంగపేటలోని హిందూ–ముస్లిం ఆధ్వర్యంలో గణేష్ చతుర్థి ఉత్సవాల్ని వైభవంగా నిర్వహించారు. పూజలు జరిపి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో షేక్ హనీఫ్, ఎం.ప్రశాంత్, సుభాని, నవీన్, దుర్గా, అనిల్, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.
- బాలాజీరావుపేటలోని మహేంద్రనగర్ కాలనీలో పార్వతీ శంకర తనయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినాయక చవితి పండుగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గణేష్ విగ్రహం వద్ద పూజలు జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని షేక్ దావూద్, శ్రీనివాస్ పర్యవేక్షించారు.
- పట్టణ మార్వాడి గుడి ఎదుట సందులో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద గురువారం అన్న సంతర్పణ జరిపారు. ఊరేగింపుగా విగ్రహాన్ని తీసుకెళ్లి కాల్వలో నిమజ్జనం చేశారు. గత 15 సంవత్సరాల నుంచి గణపతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బూర్లగడ్డ గోపాలరావు, బండి చైతన్యం, ఉమా నటరాజ్ , పండరీనాథ్, మాధవ్ పాల్గొన్నారు.
- రూరల్ మండలం కొలకలూరు, నందివెలుగు, గుడివాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి కొమ్మమూరు, తూర్పు కాల్వల్లో నిమజ్జనం చేశారు.


పాండురంగపేటలో గణేష్ విగ్రహం వద్ద పూజల్లో యువకులు


మహేంద్రనగర్ కాలనీలో అన్నదానం


మార్వాడి గుడి ఎదురు వీధిలో పూజలు

మహాకవి గురజాడకు ఘన నివాళి

తెనాలి: స్థానిక నాజరుపేటలోని లూథరన్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ వెంకట అప్పారావు జయంతిని నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.వి. రఘునాథరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ అభ్యుదయ కవి ఆళ్ల నాగేశ్వరరావు, అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడారు. గురజాడ జీవిత విశేషాల్ని వివరించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. స్కూలు విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయిని పి.ప్రియదర్శిని, ఉపాధ్యాయులు ఎం.నాగలక్ష్మి, జె.శశికళ, ఉష, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుజాతిలో చైతన్యం తెచ్చిన గురజాడ

తెనాలి అర్బన్: దేశభక్తి గేయాలు, రచనల ద్వారా తెలుగు జాతిలో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు గురజాడ అప్పారావు అని ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆరేటి రామారావు కొనియాడారు. బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గాంధీనగర్‌లో ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో రచయిత ఆళ్ల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు పరచూరి వెంకటేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.


గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామారావు, కృష్ణ తదితరులు

బీసీ ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: పార్లమెంటులో వెనుకబడిన తరగతుల సభ్యులపై అనుచిత వ్యాఖ్యల్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. కొందరు అగ్రవర్ణ, ఆధిపత్య కులాల పార్లమెంటు సభ్యులు ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన సహచర సభ్యుల్ని కించపరచేలా, ఆధిపత్య ధోరణితో అగౌరవపరుస్తూ మాట్లాడటం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. ఈ విధమైన ధోరణితో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుండటం దారుణమని పేర్కొన్నారు. రాజ్యాంగంలో భావ ప్రకటన స్వేచ్ఛను కల్పించటమంటే ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మాట్లాడటమని గుర్తుచేశారు. వెనుకబడిన తరగతుల ప్రజా ప్రతినిధులపై అన్ పార్లమెంటు పదాల్ని ఉపయోగించడం భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన కోరారు.

జీజీహెచ్ అభివృద్ధికి సహకరించాలి

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అభివృద్ధికి ప్రజలు అండగా నిలువాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఎమర్జెన్సీ అంబులెన్సు సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా గురువారం అన్నదానం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబులెన్సు నిర్వాహకుల సేవలు విలువైనవని కొనియాడారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

దోమలపై అప్రమత్తంగా ఉండండి

తెనాలి అర్బన్: దోమల వ్యాప్తి వల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం, మలేరియా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన ఎగ్జిబిషన్‌ను గురువారం జేఎంజే గ్లోబల్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. దోమలు అభివృద్ధి చెందే ప్రదేశాలు, వాటి ద్వారా వ్యాపించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్యాధికారి మాట్లాడుతూ వ్యాధులపై అవగాహన కలిగించేందుకు ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, జేఎంజే గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరిస్ పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

తెనాలి అర్బన్: ఇండియన్ స్వచ్ఛత లీగ్ ప్రోగ్రాంలో భాగంగా తెనాలి పట్టణంలోని 2,3 శానిటరీ డివిజన్‌లలో పనిచేసే 70మంది పారిశుద్ధ్య కార్మికులకు గురువారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీజాన్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ నిత్యం వ్యర్థాల్లో గడిపే కార్మికులకు వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, షేక్ బాజీ హుస్సేన్, ఎం.సుబ్బారావు, వై.అనుపమ, శానిటేషన్ సెక్రటరీలు బి.శ్రావణి, జి.దివ్య, ఎ.జ్యోత్స్న, కె.పాల్, డి.మురళీధర్, కె.ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బీబీజాన్

యోగాతో ఆరోగ్యకర జీవనం

తెనాలి అర్బన్: యోగాతో ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పిన్నక శేషభానురావు మెమోరియల్ ఉచిత యోగా శిక్షణ తరగతుల్ని గురువారం టూటౌన్ పోలీసుస్టేషన్ సమీపంలోని నారాయణ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. క్లబ్ యోగా చైర్‌పర్సన్ కందిమళ్ల స్వప్న యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యోగా గురువు నాగం వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ జీవన్‌లత, జి.వి.నారాయణ, ఈదర పూర్ణచంద్, యశ్వంత్ పాల్గొన్నారు.


యోగా నేర్పిస్తున్న స్వప్న

ప్రజల స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలి

తెనాలి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుతో అధికార, ప్రతిపక్ష పార్టీలు సాధారణ ప్రజల స్వేచ్ఛకు ఎలాంటి భంగం వాటిల్లకుండా తమ కార్యక్రమాల్ని జరుపుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సూచించారు. సంస్థ స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆరే మరిదాసు, సభ్యులు మహేష్, కోటేశ్వరరావు, జానీ మాస్టర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పల్నాటి నాగరాజు

తెనాలిలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించాలి

మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్: నంది నాటకోత్సవాల్ని కళల కాణాచి తెనాలిలో నిర్వహించాలని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. తెనాలి మండలం పెదరావూరులోని ఫిల్మ్ స్టూడియోలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు. తెనాలిలో వాటిని నిర్వహిస్తే మా ఏపీ యూనియన్‌లోని సభ్యులు సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో మా ఏపీ సంయుక్త కార్యదర్శి మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దిలీప్‌రాజా, మిలటరీ ప్రసాద్

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన

తెనాలి రూరల్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. తెనాలి మార్కెట్ వంతెన వద్ద గురువారం సాయంత్రం కూడలిలో బైఠాయించి ఆందోళనకు దిగారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగల్ని మోసం చేస్తోందని ఆరోపించారు. వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆపేదిలేదని, ప్రాణాలైనా అర్పించి ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధిస్తామని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ బి. శివరామయ్య, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.


మార్కెట్ వంతెనపై రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

మహిళా బిల్లు ప్రవేశపెట్టిన ఘనత మోదీదే...

తెనాలి టౌన్: మహిళా సాధికారతకు నిజమైన నేస్తం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అని, నారీశక్తి వందన్ పేరుతో నూతన పార్లమెంట్‌లో తొలిబిల్లును ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి పేర్కొన్నారు. పట్టణ గాంధీచౌక్‌లో గురువారం బీజేపీ నాయకులు, మహిళా నేతలు ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ప్రధాన మంత్రి మోదీ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ద్వారా మహిళా సాధికారతకు మోదీ నిర్వచనం తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.అనంతాచార్యులు, సుధాకర్, సంపత్‌రాయుడు, అన్నవరపు వేణు, జార్జి శ్రీనివాస్, మహిళా నేతలు బిట్రా కనకదుర్గ, కన్నెగంటి ప్రశాంతి, ఎస్.కనకదుర్గ, టి.గాన కళావతి పాల్గొన్నారు.


గాంధీ చౌక్‌లో మోదీ చిత్ర పటంతో బీజేపీ నేతల ప్రదర్శన

రేపు ఏఎన్నార్ శత జయంతి వేడుకలు

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 23న నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకులు డాక్టర్ తోటకూర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రముఖ సాహిత్య పరిశోధకులు పారా అశోక్ కుమార్ రచించిన 'అక్కినేని 100' (శత వసంతాల అక్కినేనికి చిత్రాంజలి) పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ రంగాలలో విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు తెలియజేశారు. అనంతరం అక్కినేని పాటల సంగీత విభావరి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అక్కినేని అభిమానులు, సినీ, సాహిత్యాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

భయం వద్దు.. క్యాన్సర్‌కు ఉంది ఆన్సర్

- నేడు వరల్డ్ రోజ్ డే
- క్యాన్సర్ బాధితులకు భరోసా కల్పిస్తూ ఏటా వేడుకలు
- గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు
- ఉచితంగా ఆపరేషన్లు
- ఆధునిక చికిత్సలతో క్యాన్సర్ నివారణ

క్యాన్సర్ ... ఈ వ్యాధి పేరు చెబితేనే చాలా మందికి ఒంట్లో వణుకు పుట్టుకొస్తుంది. వస్తే చనిపోవడమే అనే అపోహల్లో ప్రజలు ఉన్నారు. పూర్వం రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. వ్యాధిగ్రస్తుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ఏటా ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 22న రోజ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

– గుంటూరు మెడికల్

రోజ్ డే నేపథ్యం

కెనడా దేశానికి చెందిన 12 ఏళ్ల మెలిండా రోజ్ 1994లో క్యాన్సర్ వ్యాధికి గురైంది. అది కూడా చాలా అరుదైన బ్లడ్‌క్యాన్సర్ అవ్వడం, కొన్ని వారాల్లోనే బాలిక చనిపోతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కాని రోజ్ ఎలాంటి బాధ లేకుండా, భయపడకుండా ఆస్పత్రిలో ఉన్న రోగులకు రోజా పువ్వులు అందించి, వారికి కవితలు వినిపించి, మనో ఉల్లాసాన్ని కలిగించింది. ఈ విధంగా ఆరునెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగుల్ని చిరునవ్వుతో పలకరిస్తూ ఉత్తరాలు రాస్తూ వారిని ఆనందింపజేసి సెప్టెంబరు 22న మరణించింది. ఆ బాలిక జ్ఞాపకార్థం ఏటా రోజ్‌డేను నిర్వహిస్తున్నారు.

క్యాన్సర్ రోగులకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగానే పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నారు. వైద్య రంగంలో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనేక సంస్కరణలు చేశారు. ముఖ్యంగా క్యాన్సర్ రోగులకు ఆయన పెద్ద భరోసా కల్పిస్తూ ప్రొసీజర్స్ పెంచారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 2019 వరకు రోగులకు 223 ప్రొసీజర్స్‌కు మాత్రమే చికిత్స అందించారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 648 ప్రొసీజర్స్‌కు ఉచితంగా చికిత్స అందిస్తూ పెద్ద భరోసా కల్పించింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2019 నుంచి 2023 ఆగస్టు వరకు మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ వైద్య విభాగాల ద్వారా జిల్లాలో నాలుగేళ్లలో 14,626 మందికి ఉచితంగా చికిత్స అందించారు. క్యాన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడేందుకు పలు రకాల చికిత్సల కోసం ప్రభుత్వం రూ.117.47 కోట్లు ఖర్చు చేసింది.


జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డు


లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరం

క్యాన్సర్ కారణాలు

- ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగం
- సిగిరెట్, బీడీ, చుట్ట, పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా వస్తుంది.
- మద్యపానం
- వ్యాయామం చేయకపోవడం
- ఆకుకూరలు తినకపోవడం
- ఊరగాయపచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినడం
- అధిక బరువు


అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌కు నేడు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశం ఉందా లేదా నిర్ధారించే బీఆర్‌సీఏ–1, 2 పరీక్షలు ఉన్నాయి. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ విఫలం అయితే బయోథెరపీ ద్వారా వైద్యం చేసి ప్రాణాలు కాపాడవచ్చు. లాప్రోస్కోపిక్, రొబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సుమారు రూ. 45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేశాం. ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. కోట్ల రూపాయలు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, ట్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలు ప్రభుత్వం అందజేసింది. తాజాగా పెట్‌స్కాన్ పరికరం మంజూరు చేసింది. మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్, న్యూక్లియర్ మెడిసిన్, రేడియోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నాం. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి సైతం ప్యాలేటీవ్ కేర్ చికిత్సలు ఉచితంగా ఇళ్లకు వెళ్లి అందిస్తున్నాం. మందులు కూడా ఉచితంగా అందించి క్యాన్సర్ రోగుల్లో మనోధైర్యం కల్పిస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్



స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా మహిళలు 45 సంవత్సరాలు దాటాక ప్రతి ఏడాది మ్యామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. లంగ్ క్యాన్సర్ రాకుండా, పేగు సంబంధిత క్యాన్సర్లు 55 సంవత్సరాలు దాటిన వారు సిటీస్కాన్, కొలనోస్కోపి చేయించుకోవాలి. తొమ్మిదేళ్ల నుంచి 11 ఏళ్లలోపు బాలికలకు, 45 సంవత్సరాల్లోపు మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. హెపటైటీస్ బీని కూడా వ్యాక్సిన్ వేయించుకుని రాకుండా నిరోధించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, మెడికల్ అంకాలజిస్ట్

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై లాలా పేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్గా మాన్యంలో నివసించే జంగం రవికిరణ్‌కు స్వాతితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. రవికిరణ్ మద్యానికి బానిసై భార్యను తరచూ కొడుతూ, వేధిస్తున్నాడు. దీంతో స్వాతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.